70వ రోజుకు చేరిన శంకరన్న అన్నా క్యాంటీన్ కొనసాగింపు

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : అన్ని దానాల్లోనూ అన్నదానం గొప్పదని, అన్నార్తుల కోసమే అన్నాక్యాంటీను ఏర్పాటు చేసి పేదల ఆకలి తీరుస్తామని టీడీపీ నియోజకవర్గ యువ నాయకులు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు గొందు శంకర్ అన్నారు. టీడీపీ యువనాయకులు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు గొందు శంకర్ ఆధ్వర్యంలో నడుస్తున్న అన్నాక్యాంటీన్ బుధవారం 70వ రోజు కూడా కొనసాగించారు. అలాగే పాత బస్టాండ్ లో 70వ రోజు కూడా అన్న క్యాంటీన్ ను నిర్వహించారు. అలాగే మొబైల్ వ్యాన్ల ద్వారా నగరంలో పల్చోట పేదలకు నిరాశ్రయులకు భోజనాలను అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల పార్టీ తెలుగుదేశం పార్టీ, మళ్ళీ తెలుగుదేశం ప్రభుత్వం 2024 లో అధికారంలోకి వస్తుందన్నారు. 2024 లో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు మరలా అన్నా క్యాంటీన్లను కొనసాగిస్తారని చెప్పారు. అన్న క్యాంటీన్‌ల ద్వారా ప్రతిరోజు జిల్లాలో వేలాది మంది కడుపు నింపుకునే వారన్నారు. చంద్రబాబునాయుడు మరలా ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అనుకూలమైన పాలన అందిస్తారని, నేటి వైస్సార్సీపీ పాలనలో రాష్ట్రంలో పెరిగిన నిత్యావసరధరలతో పేదల, సామాన్యుల బతుకులు చిన్నాభిన్నమైనవని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 545 మంది అన్నార్తులు భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మాజీ కౌన్సలర్ అంబటి లక్ష్మిరాజ్యం, రావుల గాంధి, మోహన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మఒడి పథకంతో ఏపీలో విప్లవాత్మక మార్పు : సువ్వారి గాంధీ

విశాలాంధ్ర - ఆమదాలవలస : అమ్మఒడి పథకంతో రాష్ట్రంలో విద్యా ప్రమణాలను గణనీయంగా పెంచిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డికి ప్రతి ఒక్కరూ జేజేలు పలుకుతున్నారని ఆమదాలవలస నియోజకవర్గం సీనియర్ నాయకులు మరియు వైయస్సార్సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఆమదాలవలస తన కార్యాల యం లో ఒక ప్రకటన విడుదల చేశారు. పిల్లలను బడికి పంపే ప్రతి పేద తల్లికి యేటా రూ.15 వేల ఆర్థిక సాయంతో గత నాలుగేళ్ళలో ఇప్పటి వరకూ రూ. 26,067.28 కోట్లు అందించారని పేర్కొన్నారు. పేదరికమే అర్హతగా కుల, మత, ప్రాంత, పార్టీ, వర్గాలకు అతీతంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ ఇలా ఏ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకైనా పారదర్శకంగా, లంచాలకు వివక్షకు తావులేకుండా ప్రభుత్వం లబ్ధి చేకూర్చేందుకు పని చేస్తోందని తెలిపారు. పేద విద్యార్థులు చదువుకునేలా, పాఠశాలలో డ్రాప్ అవుట్స్‌ను గణనీయంగా తగ్గించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని ప్రవేశ పెట్టిందని అన్నారు. గత నాలుగేళ్లలో పిల్లల చదువుల కోసం చేసే ఖర్చంతా పిల్లల భవిష్యత్తుకు పెట్టుబడేనని అన్నారు. విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణ వల్ల మన రాష్ట్రం దేశానికే దిక్సూచిగా నిలిచిందని చెప్పారు. జగనన్న విద్యా కానుక, గోరు ముద్ద, నాడు-నేడు, వైయస్సార్ సంపూర్ణ పోషణ, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన వంటి పథకాలతో రాష్ట్రంలో విద్యారంగంలో సమూలంగా ఒక విప్లవాన్ని జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చారని ఈ సందర్భంగా ఆయనకు ధన్యవాదాలు తెలుపు తున్నామని ప్రకటనలో తెలియచేశారు.

ఘనంగా భజన కార్యక్రమం

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : పార్వతీపురం మన్యం జిల్లా కోటిపాము పంచాయతీ గుంపు గ్రామంలో ద్వాపర యుగంలో శ్రీ బలరామునిచే ప్రతిష్టమైన పంచలింగాలలో ఒకటైన శ్రీ సోమాదేవి సమేత శ్రీ సోమేశ్వర ఆలయంలో శ్రీకాపారపు ఫౌండేషన్ వారు నిర్వహించిన సంకీర్తన యజ్ఞం 5 మూడు రోజులు అనగా 27, 28,29, తేదీల్లో మూడు జిల్లాలకు సంబంధించిన ఎంపిక భజన బృందాలతో భజన కార్యక్రమము శ్రీ గీతాచార్య భక్తి గీతాంజలి అధినేత సీతా రమేష్ పర్యవేక్షణలో జరుగుతోంది. మొదటిరోజు శ్రీ వేణుగోపాల భక్తి గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి గ్రూప్ అడ్మిన్ అల్లు కేశవరావు, అల్లు గోవింద, కలగ రఘురాం, కుంచాల రాము, కుంచాల రాజుగారు, రావాడ ప్రసాద్, కాశీ మాస్టారు, కీబోర్డు తారక్, రాజారావు, డోలక్ మాధవ్ పాల్గొన్నారు. ఇక్కడ కార్యక్రమంలో గ్రూప్ సభ్యులను ఘనంగా సత్కరించారు.

బాలలతో పనులు చేయించడం నేరం

విశాలాంధ్ర - కాశీబుగ్గ : బాలలతో పని చేయించడం నేరమని, వారిపై ప్రేమ ఆప్యాయతలు చూ పించాలని, బాల బాలికలతో ఎవరైనా వెట్టి చాకిరీ చేయించిన లేదా హింసించిన జరిమానా పాటు జైలు శిక్ష విధించబడుతుందని బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.విశ్వేశ్వరరావు చెప్పారు. బుధవారం పలాస ప్రభుత్వ హైస్కూల్ లో సుప్రీం కోర్టు, హైకోర్టు ఆదేశాలు ప్రకారం పలాస మండల న్యాయ సంఘం, పలాస బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల బాలికలకు న్యాయ విజ్ఞాన సదస్సు పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పటినుంచే చట్టాలపై అవగాహన చేసుకో వాలన్నారు. ఎక్కడైనా అన్యాయం జరిగితే ధైర్యంగా వాటిని ఎదిరించాలని, పోలీస్ స్టేషన్లో కోర్టు దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పిండి. వెంకట రావు, సంయుక్త కార్యదర్శి అనిల్ రాజు, ట్రెజరర్ రవి, న్యాయవాదులు ఎస్వీ. రమణ, కోత రజని కుమార్, కామేశ్వర పట్నాయక్, దేవరాజు, బోయిన లక్ష్మి, హెడ్ మాస్టర్ తులసి దాస్, ఎస్ఎంసి చైర్మన్ ఎల్. శ్రీనివాస్, పీడీ తవిటయ్య, మరియు ఇంచార్జి సూపర్ డెంట్ అప్పలస్వామి, విజయ్, సంజీవ్‌రావు పాల్గొన్నారు

పాత వరకలో మెగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని పాత వరక గ్రామములో జై దుర్గా భవాని హార్డ్వేర్, సిమెంట్ షాప్ వారి 3వ వార్షికోత్సవం సందర్భంగా జేమ్స్ బ్లడ్ బ్యాంక్ వారి సౌజన్యంతో తలసేమియ పిల్లల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రాజేంద్రప్రసాద్ పాల్గొని ఆయన చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం యువత మాట్లాడుతూ షాప్ వార్షికోత్సవంలో భాగంగా ప్రతి సంవత్సరం కూడా ఇదే విధంగా తల సేమియా పిల్లల కోసం ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయటం జరుగుతుందని తెలిపారు.సుమారు 45 మంది యువకులు ఈ కార్యక్రమం లో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.వారికి సంస్థ తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సావిత్రి శ్యామ్ పురియా, డాక్టర్ వెంకటేష్, రక్షణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ధర్మరాజు విశ్వేస్,సాహు కాళీ, హేమరాజ్, మున్నా పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను సందర్శించిన కన్వీనర్ బాలాజి

విశాలాంధ్ర - నందిగాం : బాలయోగి గురుకుల పాఠశాల కళాశాలలో సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ చైర్మన్ హామీ ఇచ్చారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా గురుకుల పాఠశాల కన్వీనర్ బాలాజీ నందిగాం గురుకుల పాఠశాలను సందర్శించి నందిగాంలోని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ తిలక్ ను కలిశారు. ఈ సందర్భంగా గురుకులంలోని సమస్యలపై చర్చించారు. తిలక్ మాట్లాడుతూ గురుకులంలో ఉన్న సమస్యలు పరిష్కారానికి తమ వంతు పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. పాఠశాలలో మంచినీటి సమస్య పరిష్కరించడంతో పాటు నాడు నేడు నిధులతో పాఠశాలలో సమస్యలు పరిష్కారిస్తామని అన్నారు. నడుపూరు శ్రీరామ్ మూర్తి ఎంపీపీ ఇంజనీరింగ్ సిబ్బందితో గురుకుల పాఠశాలను సందర్శించారు. గురుకులంలో నీటి సమస్యను గుర్తించి ఎస్టిమేట్ తయారు చేయించి మండల పరిషత్ నిధులతో సమస్య పరిష్కారానికి చర్య తీసుకుంటానని శ్రీరామ్ మూర్తి ఎంపీపీ అన్నారు.

నవధాన్యాలు సాగుతో బహుళ ప్రయోజనాలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : మండలం సింగుపురం పంచాయతీ మనుబుపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు చేత నవధాన్య విత్తనాలను వేయించారు. సిబ్బంది ఈశ్వర్ మాట్లాడుతూ రైతులు చేత గ్రామాలలో ముఖ్యంగా ఈ నవధాన్య సాగును ప్రోత్సహిస్తున్నామని, ఈ నవధాన్యాలు సాగు చేయడం వలన తర్వాత వేసుకునే ప్రధాన పంటకు అవసరమైన అన్ని రకాల సూక్ష్మజీవులు నేలలో సమృద్ధిగా అభివృద్ధి చెంది తద్వారా నేల సారవంతంగా మారుతుందని తెలిపారు. అదేవిధంగా నేలలో సేంద్రియ కర్బను అభివృద్ధి చెంది పంట దిగుబడి పెరుగుతుందని అన్నారు. అలాగే మా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రతిరోజూ గ్రామాలలో రైతులకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ఈ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను తెలియజేస్తూ ఆ దశగా ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ఎక్కువ మంది రైతులతో ఎక్కువ విస్తీర్ణంలో చేయడానికి కృషి చేస్తున్నామని అన్నారు. రానున్న ఖరీఫ్ సీజన్లో రైతులను విత్తనం వేసిన నుండి మరల పంట తీసేంతవరకు కూడా పూర్తిగా ప్రకృతి సాగులోనే పంటలు పండించే విధంగా మేము రైతులకు ఆ విధంగా సలహాలు సూచనలు ఇస్తూ ఈ ప్రకృతి వ్యవసాయాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అయినా కీర్తన, రామలక్ష్మి, ఈశ్వరమ్మ, రైతులు పాల్గొన్నారు.

నిత్య నారాయణ సేవకు రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర - పొందూరు : భగవాన్ సత్య సాయి బాబా దివ్య ఆశీస్సులతో సంవత్సరాల తరబడి దిక్కు ముక్కు లేని అనాధ జనానికి పట్టెడు అన్నం పెట్టే సత్య సాయి సేవా సమితి కన్వీనర్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించే నిత్య నారాయణ సేవకు స్థానిక వాస్తవ్యులు కీర్తి శేషులు రమణ అమ్మాజీ జ్ఞాపకార్థంతో ఆ కుటుంబ సభ్యులు మందుల శ్రీనివాసరావు స్వర్ణల సంయుక్తంగా సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రాధా కృష్ణకు లక్ష రూపాయలు నిత్య అన్నదాన నిమిత్తము అందించారు. ఈ కార్యక్రమంలో సాయి భక్తులు పెన్నాం నానాజీ, పాలిశెట్టి సూర్య ప్రకాశరావు, గుడ్ల సాయిరాజ్, సిహెచ్ వెంకట్రావులతో పాటు సాయి బాబా భక్తులు పలువురు పాల్గొన్నారు.

ఆంజనేయులు మృతి తీరని లోటు

విశాలాంధ్ర - గార : జర్నలిస్టు, జర్నలిస్టుల ఉద్యమనేత అంబటి ఆంజనేయులు మృతి పాత్రికేయ లోకానికి తీరని లోటని జిల్లా న్యాయవాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు అన్నారు. బుధవారం శ్రీకాకుళంలో ఆయన అంబటి సంతాప కార్యక్రమం బీసీ అడ్వకేట్స్ అసోసియేషన్, జర్నలిస్టు సంఘాల నేతల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ అడ్వకేట్ సంఘం అధ్యక్షులు ఆగూరి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆంజనేయులు తన జీవితాన్ని జర్నలిస్టుల సంక్షేమానికి అంకితం చేశారన్నారు. ఉత్తరాంధ్ర జర్నలిస్టుల ఫోరం నాయకులు చౌదరి లక్ష్మణరావు మాట్లాడుతూ ఆంజనేయులు నాలుగు దశాబ్దాల పాటు వివిధ పత్రికల్లో పేద, రైతు, కార్మిక, బడుగు, బలహీన వర్గాల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి ఎంతో సేవ చేశారని అన్నారు. కార్యక్రమంలో న్యాయ వాదులు బీవీ రమణ, కూన అన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - కవిటి/కంచిలి : మండల పరిధిలోని గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు బుధవారం స్థానిక ఎంపీపీ దేవదాసు రెడ్డి, స్థానిక సర్పంచులు శంకుస్థాపన చేశారు. అర్జునపురం గ్రామం స్మశాన వాటికలో తాగునీటి బోరు పనులకు స్థానిక సర్పంచ్ ప్రతినిధి రంగాల శ్రీను శంకుస్థాపన చేశారు. అలాగే అంపూరం పంచాయతీ నర్సముకుంద గ్రామంలో ఎంపీపీ నిధులు 3 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన సిసి రోడ్డు పనులకు స్థానిక సర్పంచ్ మద్ది మోహినితో కలిసి ఎంపీపీ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు రామదాసు, స్థానిక నాయకులు ఎం.ఆదినారాయణ, డి.ధర్మారావు, ఎం.ఆనందరావు, పి.అప్పారావు, బి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా శివసాగర్ బీచ్ అభివృద్ధి

జాయింట్ కలెక్టర్ నవీన్ కుమార్

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : అక్కుపల్లి శివసాగర్ బీచ్ ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ నవీన్ కుమార్ అన్నారు. బుధ వారం కలెక్టర్ ఆదేశాలు మేరకు రెవెన్యూ శాఖ పర్యాటక కేంద్రం కోసం సేకరించిన స్థలాన్ని పరిశీలించారు. పర్యాటక కేంద్రం అభివృద్ధి కోసం 5 ఎకరాల స్థలం అవసరం ఉంది. ఈ మేరకు రెవెన్యూ భూములు, సిఆర్‌జెడ్ భూములను పరిశీలించారు. భవిష్య త్తు పర్యాటక కేంద్రాలు అభివృద్ధి కి అవ కాశాలు ఉన్నాయని, ఆదిశగానే ఆలోచన జరుగుతుందని జెసి తెలి పారు. పర్యాటక రంగం అభివృద్ధి ద్వారా ఆదాయం సమకూర్చ కోవాలనేది ప్రభుత్వం ఆలోచన చేస్తుందని వివరించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.అప్పలస్వామి, ఆర్ఐ పవిత్ర, మండల సర్వేయర్ సుభాష్, విఆర్ఓలు ఇందిరా ప్రియదర్శిని, వెంకటరావు, సర్పంచ్ ప్రతినిధులు లండ రామ లింగం, డొంక విద్యాసాగర్‌లతో పాటు దున్న శ్రీనివాస్, కోనేరు కామేశ్వరరావు పాల్గొన్నారు.

వలంటీర్ల సర్వేతో పథకాలు

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : తమ ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచనతో రూపుదిద్దుకున్న వలంటీర్ వ్యవస్థతో పథకాలు అంది వ్వడం జరుగుతుందని మున్సిపల్ ఛైయిర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. బుధవారం పురుషోత్తపురం సచివాలయం పరిధి ఏ.ఎస్. పేటలో సురక్ష కార్యక్రమాన్ని కమీషనర్ ఎస్.రమేష్‌తో కలిసి ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె వలంటీర్స్‌తో ప్రతి ఇంటికి వెళ్ళి వాళ్ళకి ఇచ్చిన మొబైల్ అప్‌లో సర్వే చేస్తున్న విధానాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు సురక్ష కార్యక్రమంలో వాలంటీర్ ఇంటి వద్దకు వచ్చి , వాళ్ళు చేసిన సర్వే ద్వారా ఆ కుటుంభీకకులు ఏ పథకానికి అర్హులు అయితే ఆ పథకానికి సంబంధించిన వివరాలు తీసుకోవడం జరుగు తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 11 రకాల సర్టిఫికెట్స్‌ను అర్హత బట్టి ఉచితంగా పొందవచ్చని, వాలంటీర్లు చేస్తున్న సర్వేకు సహకరించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ సెక్రటరీ దయాకర్, వార్డ్ కన్వీనర్ సాలీనా బాలాజీ, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

గిరిజనలను వైసీపీ విస్మరించింది : టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

విశాలాంధ్ర - మందస : వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం గిరిజనులను విస్మరించిందని, గిరిజనులకు అండగా టిడిపి ఉంటుందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. బుధవారం మందస మండలం నరేష్ ఫంక్షన్ హాల్ పలాస నియోజకవర్గం గిరిజన ఆత్మీయ సమావేశం సవర రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్న గిరిజన సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని ఆరోపించారు. గిరిజన గ్రామాల్లో నూతన రోడ్లు వేయకపోగా పాడైన రోడ్లకు మరమ్మతులు చేపట్టడం లేదని విమర్శించారు. గిరిజన ప్రాంతాలకు రవాణా వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని ఆవేదన వ్యక్తంచేశారు. టిడిపి హయాంలో గిరిజన గ్రామాల్లో మారుమూల కూడా బిటి రోడ్డులు, తాగునీరు సౌకర్యం కల్పిచడం జరిగిందని గుర్తు చేశారు. గిరిజన ప్రాంతంలో ఏదైనా అభివృద్ధి జరిగిందంటే ఒక్క తెలుగు దేశం ప్రభుత్వంలోనే జరిగిందన్నారు. రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు పదేపదే గౌతు కుటుంబం ఏమి చేసిందని కాకిలా అరవడం తప్ప ఆయన ఈ నాలుగేళ్లలో ఏమి అభివృద్ధి కార్యక్రమాలు చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు . గిరిజనల సాగు పోడు భూములు పై కన్నేసిన మంత్రి గిరిజనులకు పట్టాలు ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. రాబోయే యువగళం పాదయాత్ర మందసలో లోకేష్ బాబుతోనే ఐటిడిఏ కార్యాలయం ఏర్పాటు కోసం స్పష్టమైన హామీ ఇచ్చారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో గిరిజన నాయకులు, కార్యకర్తలు, మహిళలు తెలుగు దేశం పార్టీ విజయాని కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లోడగల కామేష్, పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పిరికట్ల విఠల్ రావు, పార్లమెంట్ అధికార ప్రతినిధి దాసరి తాతారావు, మందస మండల పార్టీ అధ్యక్షులు దుర్యోధన జనరల్ సెక్రెటరీ రుద్రయ్య, నవీన్ సవర లక్కయ్య సమర శంకర రావు సవర మోహన్ రావు సవర ప్రశాంత్ సవరచంద్రశేఖర్ సవర కుమారి లకియా తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించిన మీడియా ప్రతినిధులపై ఎదురుదాడి



విశాలాంధ్ర - అరసవల్లి/శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ఆవరణలోకి మీడియాకి అనుమతించ కుండా ఆర్ఎంఓ శంకర రావు కొత్తగా ఆదేశాలు ఇవ్వడం వివాదాస్పద మైంది. ఎచ్చెర్ల మండలంలో కన్న తండ్రే కొడుకును హత్య చేసిన ఘటనకి సంబంధించి మృతదేహాన్ని మార్చురికి తరలించడంతో కవరేజీ కోసం బుదవారం వెళ్ళిన మీడియా ప్రతినిధులను గేటు వద్ద సెక్యూ రిటీ సిబ్బంది అడ్డుకున్నారు. మీడి యా ప్రతినిధులను లోపలకి అనుమ తించవద్దని ఆర్ఎంఓ శంకరరావు ఆదేశాలు జారీ చేశారంటూ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. దీంతో మీడియా ప్రతినిధు లంతా షాక్ కి గురయ్యారు. ఆర్ఎంఓ అనుమతి కోసం ఆయనను సంప్రదించగా శంకర్ రావు మీడియా ప్రతినిధుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. మీడియాను రిమ్స్ లోపలకి అనుపతి ఇవ్వకపో వడంతో మీడియా ప్రతినిధులు, జర్నలిస్టు సంఘాల నాయకులు ఆందోళనకి దిగారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద బైటాయించి నిరసనలను తెలియజేశారు. అనంతరం జర్నలిస్ట్ నాయకులు ఆర్ఎంఓ శంకర్ రావు తీరుపై జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కి ఫిర్యాదు చేశారు. అదేవిధంగా అమ్మ ఒడి కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసిన రాష్ట్ర శాసన సభాపతి తమ్మినేని సీతారాంకి ఫిర్యాదు చేయగా ఆయన తాను మాట్లాడతానని మీడియా ప్రతినిధులకి హామినిచ్చారు. ఆర్ఎంఓను సంప్రదిచేందుకు ఆయన సిబ్బంది ప్రయత్నించినా అందుబాటు లోకి రాకపోవడం తో స్పీకర్ సీతారం సీరియస్ అయ్యారు. జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తో మాట్లాడి ఆర్ఎంఓను సస్పెండ్ చేయమని చెబుతామని మీడియా ప్రతినిధులకి హామినిచ్చారు.

మాదకద్రవ్యాలు వాటి దుష్ప్రభావాలపై అవగాహన

విశాలాంధ్ర - పాతపట్నం : ప్రతిఒక్కరూ గంజాయి, ఖైనీ, గుట్కా, సారా వంటి మాదక ద్రవ్యా లకు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సిఐ లక్ష్మణ్ నాయుడు సూచించారు. బుధవారం స్థానిక సెంటెన్స్ కాన్వెంట్ స్కూల్లో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యా ర్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగంతో విలువైన ప్రాణాలను పోగొట్టుకోవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్ధాలు మీ గ్రామాల్లో తోటి వారికి వివరించాలని కోరారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండి బాగా చదువుకోవాలని, ఉత్తమ పౌరులుగా గుర్తింపు పొందాలని కోరారు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను, నష్టాలను వారు విద్యా ర్థులకు వివరించారు. మాదక ద్రవ్యాలను వినియో గించినా, రవాణా చేసినా వెంటనే తెలియజేయలని కోరారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని మాదక ద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు భాగస్వామ్యులు కావాలన్నారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ప్రిన్సీ పాల్, ఉపాధ్యాయులు వివిఎన్.మూర్తి, థామస్ సార్ , పిటి వసంత్ సార్,దేవికా, శైల కుమారి టీచర్స్ సిస్టర్ రోవెన, ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ నాయుడు దస్తగిరి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలలో శ్రీకర్, ఉదయ్‌లకు ద్వితీయ స్థానం

విశాలాంధ్ర- కవిటి : మండలంలోని బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన శ్రీకర్, ఉదయ్ లు జిల్లాస్థాయి క్విజ్ పోటీ లలో పాల్గొని ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. బుధవారం జిల్లాస్థాయిలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీలలో బొరివంక పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రీకర్, ఉదయ్ లు సత్తా చాటారు.వీరు జిల్లా స్థాయిలో రెండవ స్థానాన్ని పొందారు.వీరికి జిల్లా కలెక్టర్ శ్రీకేస్ లాఠకర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ద్వితీయ స్థానం పొందిన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య,మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి అభినందనలు తెలియజేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు సనపల రామకృష్ణ,ఉపాధ్యాయ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

గ్రామాల్లో కనీస సౌకర్యాలకు ప్రాధాన్యత

విశాలాంధ్ర- జలుమూరు : గ్రామాల్లో కనీస సౌకర్యాలు కల్పించేందుకు ప్రాధాన్యత ఇచ్చామని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. జలుమూరు మండలం రాణా గ్రామంలో వంశధార కాలువ నుండి శివాలయం వరకు నిర్మించిన సిసి రోడ్డు ప్రారంభించారు. గడప గడపకు నిధులతో నిర్మించిన రోడ్డు స్థానికులకు ఉపయోగ పడుతుందన్నారు. ఎంపీపీ వాన గోపి, స్థానిక ఎంపీటీసీ బుక్క తేజోమణి, లక్ష్మణరావు, స్థానిక సర్పంచ్ దుంగ శాంత కుమారి ఉన్నారు.

ముఖ్యమంత్రికి మతి భ్రమించింది

విశాలాంధ్ర - పలాస : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి మతి భ్రమించిందని, వారాహి విజయ యాత్ర చూసి ఇక నాకు అపజయం తప్పదని భయపడుతూ ఇష్టానుసారంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పై పిచ్చి పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని జనసేన నాయకులు వి దుర్గారావు బుధవారం ప్రకటన లో ఎద్దేవా చేశారు. వారాహి విజయ యాత్రకు వస్తున్న ప్రజా స్పందనను చూసి త్వరలో జరగబోయే ఎన్నికలలో ఓటమి తప్పదని ముఖ్యమంత్రికి భయం పట్టుకొందని అందుకే ఇలాంటి ప్రేలాపనలు పేలుతున్నారని మండిపడ్డారు . పథకాలు ఇవ్వటానికి వెళ్లి పెళ్ళాల కోసం గురించి ఎందుకు మాట్లాడుతున్నరని ప్రశ్నించారు. సీఎం హోదాలో ఉండి రాజకీయ దిగజారుడుతనం మీ అసమర్ధతకు నిదర్శనమని, అసత్యపు ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. మీరు చేసిందేమిటో ప్రజలందరికీ తెలుసు అన్నారు. ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు. పవన్‌పై అవాకులు, చెవాకులు మానుకోవాలని హితవు పలికారు.

ఎమ్మెల్యే పరామర్శ

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండలం పల్లిగొల్లగండి గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన ఐరోతు రాజు కుటుంబాన్ని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ బుధవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను బాధిత కుటుంబీకులను అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి మనోధైర్యంకల్పించి కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఈ పర్యటనలో నిట్ట గోపాల్, ఆర్‌బాబూరావు, ఎస్.గురుమూర్తి, ఈ.చంద్రయ్య, టి.హరి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటిన స్కూలు విద్యార్థులు

విశాలాంధ్ర - పాతపట్నం: సెంటెన్స్ కాన్వెంట్ స్కూల్లో పర్యావరణ పరిరక్షణపై స్కూల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వాతావరణంలో వస్తున్న మార్పులు వల్ల ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయని ప్రతి ఒక్క విద్యార్థి చెట్లను నాటి వాటి ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్కూల్లో విద్యార్థులచే మొక్కలను నాటించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, సిస్టర్ రోవేనా, ఎమ్మెస్సార్ ఎన్వీఆర్ శర్మ, థామస్, వారుని,సరిత, నివేదిత భారతి, శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

బిఆర్ఏయూలో సమీకృత ఉపాధ్యాయ కోర్సు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : డిగ్రీతో పాటు బీఈడీ నాలుగేళ్ల సమీకృత ఉపాధ్యాయ విద్యా కార్యక్రమం (ఐటీఈపి) లో 2023 - 24 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టి ఏ) ఆహ్వానిస్తుంది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ తో పాటు దేశవ్యాప్తంగా ఐఐటీలు, ఎన్ఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీలో రాష్ట్రస్థాయి యూనివర్సిటీలు కళాశాలలో మొత్తం 42 సంస్థల్లో ఈ కోర్సులో ప్రవేశం కల్పిస్తున్నారు. ఈ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఎన్టిఏ ఈనెల 26వ తేదీ నుంచి జూలై 19వ తేదీ వరకు ఆన్లైన్ లో స్వీకరిస్తున్నట్లు అంబేద్కర్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకట్రావు తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులని చెప్పారు. దేశంలో 17 నగరాల్లో 13 భాషల్లో తెలుగుతోపాటు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటి) ఆధారంగా జాతీయ స్థాయిలో పరీక్ష ఆధారంగా ప్రవేశాలు జరుగుతాయని తెలిపారు. పరీక్ష విధానం సిలబస్ ఎంపిక చేసుకోవాల్సిన సబ్జెక్టులు, విద్యార్హతలు దరఖాస్తు చేసే విధానం తదితర వివరాల కోసం డబ్ల్యు డబ్ల్యు డాట్ ఎన్ టి ఏ డాట్ ఏసి డాట్ ఇన్, ఎన్సిఈటి ఎస్ ఏ ఎం ఏ ఆర్ టి హెచ్ డాట్ ఏసి డాట్ ఇన్ వెబ్సైట్లు పరిశీ లించాలన్నారు. కాగా, కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఈ వినూత్న విద్యా కార్య క్రమంలో సుశిక్షితులైన ఉపాధ్యాయులను దేశానికి అందించవచ్చు అన్నారు. జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్సిటిఈ) గుర్తింపు కలిగిన ఐటిఈపి కోర్సు నిర్వహించేందుకు 42 విద్యాలయాలు ఎంపిక కాగా ఇందులో ఆంధ్రప్రదేశ్లో రెండు యూనివర్సిటీలకు మాత్రమే గుర్తింపు లభించిందన్నారు జాతీయ సంస్కృతి విద్యాలయం (తిరుపతి), డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ (శ్రీకాకుళం) లు మాత్రమే ఈ కోర్సు నిర్వహణకు ఎంపిక అయ్యాయని చెప్పారు. బి ఆర్ ఏ యూ లో బిఏ (ఎడ్యుకేషన్) బీఎస్సీ (ఎడ్యుకేషన్) లో చేరో 50 సీట్లు వంతున రెండు యూనిట్లు నిర్వహణకు ఎన్సిటిఈ అనుమతి ఇచ్చిందన్నారు. హెచ్ఇపి, ఎంపిసి సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులని తెలిపారు. ఈ క్యాంపస్ లోనే ఈ కోర్సు నిర్వహిస్తామన్నారు.

అమ్మఒడి పేద విద్యార్థులకు ఒక వరం : శాసన సభాపతి తమ్మినేని

విశాలాంధ్ర -శ్రీకాకుళం: చదువే భావితరాలకు మనం ఇచ్చే ఆస్తి అని, రాష్ట్ర ముఖ్యమంత్రి విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతను కల్పిస్తూ అమ్మ ఒడి, నాడు నేడు, గోరుముద్ద వంటి అనేక కార్యక్రమాలను విద్యార్థుల కోసం అమలు చేస్తున్నారని శాసన సభాపతి తమ్మినేని సీతారామ్ అన్నారు. బుధవారం ఉదయం రాష్ట్ర ముఖ్య మంత్రి నవరత్నాలలో భాగంగా జగనన్న అమ్మఒడి పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.15,000 వంతున జమ చేసే కార్యక్రమాన్ని పార్వతీపురం జిల్లా నుండి ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా వరుసగా నాల్గవ సారి 2022-23 సం. కు గాను ఒకటి నుండి ఇంటర్ వరకు చదువుతున్న 1,91,689 మంది పేద విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తు, అమ్మఒడి 1,91,689 మంది తల్లుల ఖాతాలకు రూ. 287.53 కోట్లు కంప్యూటర్ బటన్ నొక్కి జమ చేసే కార్యక్రమం చేపట్టగా, బాపూజీ కళామందిర్ లో నిర్వహించిన జిల్లా స్థాయి కార్యక్రమాన్ని శాసన సభాపతి, జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసన సభాపతి తమ్మినేని సీతారామ్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు శుభాకాంక్షలు తెలిపారు, చదివే భావితరాలకు ఇచ్చే ఆస్తిఅని ఆ దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమ్మ ఒడి, నాడు నేడు, గోరుముద్ద, జగనన్న వసతి, దీవెన విద్యా దీవెన వంటి అనేక కార్యక్రమాలను ప్రారంభించి అమలు చేస్తున్నారన్నారు. విద్యార్థులు చదువులో రాణించి ఏ రాష్ట్రంలో నైనా, ఏ దేశంలో నైనా వారి ప్రతిభను కనబరిచే విధంగా విద్యాభి వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధా న్యతను ఇస్తుందని, తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చక్కగా బడికి పంపి చదివించాలన్నారు. ప్రతి విద్యార్థి చదువుకొని విద్యారంగంలో ముందు ఉన్నట్లయితే ఆ రాష్ట్రం ఆర్థికంగా ముందుంటుందన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. క్యాలండర్ ప్రకటించి ప్రభుత్వ పథకాలు అందజేసిన ముఖ్యమంత్రి భారతదేశంలో ఒకేఒక్కరు ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నాడు నేడు ద్వారా ప్రభుత్వం పాఠశాలను ఆధునీకరణ చేయడంతో పాటు మౌలిక వసతులు కల్పిస్తూ విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుకునే విధంగా పాఠశాలలో అదనపు తరగతి గదులను కూడా నిర్మించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఎక్కడ ఏ పాఠశాలలో సమస్యలు ఉత్పన్నమైన వెంటనే ఆయా పాఠశాలల కమిటీ సభ్యులు గానీ, విద్యార్థుల గాని తన దృష్టికి తీసుకు వస్తే సమస్యలు వెంటనే పరిష్కరిస్తానని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో డి. ఈ.ఓ, తిరుమల చైతన్య, సర్వశిక్ష అభియాన్ ఎ.పి.సి జయప్రకాష్, ఉప విద్యా శాఖాధికారి పగడాలమ్మ, సహాయ కమీషనర్ అలీ ఖాన్, రీజనల్ ఇంటర్మీ డియట్ అధికారి దుర్గా రావు, లబ్ధి దారులు పాఠశాల విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి

- శ్రీకాకుళం పార్లమెంటు సభ్యులు కింజరాపు రామ్ మోహన్ నాయుడు

విశాలాంధ్ర - శ్రీకాకుళం : భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ శ్రీకాకుళం నెహ్రూ యువ కేంద్ర వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల సమావేశమందిరంలో జిల్లా స్థాయి యువ ఉత్సవ్ - 2023 (ఇండియా ఏ2047) కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్లమెంటు సభ్యులు కింజ రాపు రామ్మోహన్‌నాయుడు పాల్గొని ముందు జ్యోతి ప్రజ్వలన చేసి స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి, అనంతరం ఎంపీ, యువత నుద్దేశించి మాట్లాడుతూ అభిరుచుల ఆశయ సాధన కోసం కృషి చేస్తూ దేశాభివృద్ధిలో యువత భాగ స్వామ్యం కావాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పంచాప్రాణాలు (ఐదు సంకల్పాలు) అనుసరిచరించడం ద్వారా 2047నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశాలలో ఒకటిగా నిలుస్తాం దన్నారు. భారతదేశం అభివృద్ధి చెందే దేశంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పంచప్రాణాలు 2047 నాటికి యువతకు మాం ్గదర్శకంగా ఉంటుందన్నారు. దేశప్రజలు అత్యంత ప్రధానమైన ప్రాథమిక వసతులు, ఆహారం, దుస్తులు నీడకోసం బాధపడిన రోజులన్నాయని, కోవిడ్ సమయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార భద్రత సంక్షేమ పథకాలు దిగువశ్రేణి ప్రజలకు ఎంతో ప్రయోజనం కలిగించాయని అన్నారు.

నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువజన అధికారి కె వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ యువశక్తి పెంపుదలలో బాగంగా యువ ఉత్సవ్ 2023 పేరున అభివృద్ధి చెందిన భారతదేశం లక్ష్యం బానిసత్వం, వలసవాదం మనస్తత్వాలను తొలగించడం వారసత్వం ఐక్యత సంఘీభావం పౌరులలో కర్తవ్యభావం (పంచ ప్రాణాలు) ఇలా ఐదు అంశాలుగా జిల్లా స్థాయిలో డిబేట్ యువ కళాకారులు రచయితలు ఫోటోగ్రాఫీ సాంస్కృతిక సంప్రదాయక వారసత్వ ప్రదర్శనలు అంశాలు వారిగా పోటీలు నిర్వహిస్తున్నామని జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు ధ్రువపత్రం మెమొంట్ అతిథిలచే ప్రధానం చేయబడునని జిల్లా స్థాయిలో గెలుపొందిన వారికి రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా. కె శ్రీరాములు, ఈ కార్యక్రమంలో సెట్‌శ్రీ సిఇఓ.బి.వి. ప్రసాదరావు, మెప్మా పథకసంచాలకులు ఎమ్. కిరణ్ కుమార్, టూరిజం అధికారి ఎన్ నారాయణరావు ఎన్ వై కె ఘనంకాధికారి మరియు కార్యక్రమ సహాయకులు డి. శ్రీనివాస్, గాయత్రి మహిళా మండలి అధ్యక్షురాలు సవ్వానా ఉమామహేశ్వరి స్పందన వాలంటరీ ఆర్గనైజషన్ అధ్యక్షులు వంచిరెడ్డి కృష్ణారావు యువతీ యువకులు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని డి గొణప పుట్టుగ గ్రామంలో స్థానిక సర్పంచ్ బెందాళం కిరణ్ కుమారి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ శిక్షణలో భాగంగా మిగిలి ఉన్న అర్హులైన లబ్ధిదారులను గుర్తించి సంక్షేమ ఫలాలు అందజేయాలని కోరారు.జగనన్న సురక్ష క్యాంప్లో 11 రకాల సర్టిఫికెట్లు జారి చేయబడతాయని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు పూర్ణచంద్రుడు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు నీలయ్యా,జే సి ఎస్ అధ్యక్షుడు జల్లు యుగంధర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వెలుగు లబ్ధిదారులకు కళ్లద్దాలు

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండ లం వలాస పురం గ్రామంలో వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ఆ గ్రామంలో 60 మందిని సంబంధిత అధికారులు గుర్తించారు. ఆయా లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా బుధవారం కళ్లద్దాలను సర్పంచ్ తడకజోగారావు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎఎన్ఎం విద్యావతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పద్ధతులు మార్చుకోకుంటే చర్యలు

విశాలాంధ్ర - మెళియాపుట్టి : పెద్దలక్ష్మీపురం గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల హాజరు నమోదులో గాని, మెనూ ప్రకారం ఆహార పదార్థాలు తయారు చేయడంలో గాని ఇతరత్రా సమస్యలు ఎక్కువగానే కనిపిస్తున్నాయని ఇక్కడ పద్ధతులు మార్చుకోకుంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసిల్దార్ సరోజిని అన్నారు. మండలంలో గల పెద్దలక్ష్మీపురంలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆమె సందర్శించారు. పాఠశాలను సందర్శించి విద్యార్థులతో, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థుల హాజరు నమోదులో తేడాలు, మెనూ ప్రకారం ఆహార పదార్థాలు తయారీ లేకపోవడం, మెయింటెనెన్స్ సైతం సక్రమంగా లేకపోవడం గుర్తించారు. పాఠశాలలో ఉన్న సమస్యలను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లడం జరుగు తుందన్నారు. అనంతరం విద్యార్థుల కొరకు తయారుచేసిన మెనూని సైతం పరిశీలించారు. ఆమెతోపాటుగా ఎంపీపీ ప్రతినిధి ఉదయ్ కుమార్, మండల విద్యాశాఖ అధికారి దేవేందర్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, వీఆర్వో అన్నాజీరావు తదితరులు ఉన్నారు.

మెరుగైన సౌకర్యాలతో జగనన్న కాలనీలు సరవేగంగా పూర్తి చేయండి

రాష్ట్ర వైసీపీ యువజన విభాగ్ ప్రధాన కార్యదర్శి చిరంజీవి నాగ్

విశాలాంధ్ర - పొందూరు : రాష్ట్రంలో జగనన్న కాలనీలు కాదు, బహు సుందరమైనజగనన్న ప్రత్యేక గ్రామాలు నిర్మిస్తున్నా భాగ్యం సర్కారుకే దక్కిందని రాష్ట్ర వైయస్సార్ యువజన ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. మండల కేంద్రంపైడికొండ సమీపంలో గల జగనన్న కాలనీ నిర్మాణాన్ని బుధవారం ఆయన సందర్శించారు. కాలనీ మౌలిక సౌకర్యాలు కల్పనలో అధికారులు అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. విద్యుత్తు, తాగునీరు, రోడ్లు, బహు సుందరంగా అందుబాటులోకి వేగంగా తేవాలని ఆదేశించారు. గృహ నిర్మాణదారులు వేగంగా నిర్మాణాలు చేసేందుకు ప్రోత్సాహించాలని కోరారు. ఒకటి రెండు కాదు ఈ ప్రతి ఒక్కరికి అర్హులైన వారికిగృహ నిర్మాణం చేయాలన్న తపన ప్రభుత్వం కల్పించిందనిఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్లో ఏ ప్రభుత్వ ముఖ్యమంత్రి ఇవ్వలేనని గృహ నిర్మాణాలు నిరుపేదలకు అందించడం సర్కారీ కి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యుడులోలుగు కాంతారావు, మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, పట్టణ పార్టీ అధ్యక్షులు గాడు నాగరాజు పలువురు అధికారులు పాల్గొన్నారు.

శాఖాంబరి రూపంలో కొత్తమ్మతల్లి

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : స్థానిక శ్రీ కొత్తమ్మతల్లిని శాఖాంబరి అమ్మవారి రూపంలో పలు రకాల కూరగాయలతో బుధవారం అలంకరించారు. ఆషాడమాసంలో శాఖాంబరి అమ్మవారు వెలిచారని ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకున్నావారికి సుఖశాంతులతో పాటు ఆయుర ఆరోగ్య ఐశ్వర్యాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. అందువల్ల ఈ మాసంలో స్థానిక కొత్తమ్మవారిని ఆలయ పూజారి కమ్మకట్టు రాజేష్ తన సొంత ఖర్చులతో పలు రకాల కూరగాయలు కొని అమ్మవారిని శాఖాంబరిగా అలంకరించారు. ఈ రూపంలో ఉన్న కొత్తమ్మతల్లిని దర్శించుకోవాలని భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని క్యూకట్టారు.

శ్రీనిలయానికి జగన్నాధుడు

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : జేష్ఠ అభిషేకాలతో సుస్తి కల్గి పదిహేను రోజుల పాటు చీకటి ఉండి, పెంచిన తల్లి వద్దకు బలబద్ర, సుబద్ర సమేతంగా వెళ్ళి తొమ్మిది రోజుల పాటు గుడించా మందిరంలో గడిపిన జగన్నాథస్వామి బుధవారం మారు రథయాత్రతో శ్రీనిలయానికి చేరుకున్నారు. లక్ష్మిదేవి పిలువుతో భక్తుల కోలాహలం కీర్తనల నడుమ స్వామి శ్రీ క్షేత్రానికి చేరకోగా స్వామి వార్లను మందిరంలోకి చేర్చి ప్రత్యేక పూజలు జరిపించారు. ఉదయం నుండి ఆలయ అర్చకులు రామ్‌ప్రసాద్ సిద్దాంతి, ఎస్కే గోపాలక్రిష్ణమాచార్యులు, రామ క్రిష్టాచార్యులు, పద్మనాభాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను సాంప్రదాయంగా నిర్వహించి, సాయంత్రం ఉత్సవ మూర్తులను యాత్రకు అలంకరించి రథారోహణం జరిపారు. భక్తుల దర్శనం అనంతరం తిరుగు రథయాత్రను సాగించారు.

ఆర్టీసీ సిబ్బంది నిజాయితీ

విశాలాంధ్ర - కాశీబుగ్గ : పలాస డిపో ఆర్‌టిసి సిబ్బంది తమ నిజాయితీని చాటుకున్నారు. బుధ వారం ఎపి 30 జెడ్ 0016 బస్సు కవిటి నుండి బయలుదేరి సోంపేట మీదుగా పలాస వస్తుండగా జెజ్జి పుట్టుక వద్ద బడే మాధవరావు బస్సు ఎక్కి సోంపేటలో దిగే సమయం లో అతను బస్సు లో రూ.140,000 నగదు మరియు 10 తులాల వెండి పట్టీలు మర్చిపోగా బస్సు డ్రైవర్ ఎస్ కె రావు మరియు కండక్టర్ వి.పరసయ్య డిపో సెక్యూరిటీ విభాగంలో అందజేసారు. అందులో ఉన్న చిరునామా తో మాధవరావు కు సమాచారం ఇవ్వడం తో డిపో వద్దకు చేరుకున్నారు. ఆర్ ఎచ్ సి గురుగుపల్లి రామ్మోహన్ రావు మరియు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ చిన్నారావు గారి సమక్షంలో బడే మాధవరావు దొరికిన నగదు, వెండి వస్తువులు అందజేయడం జరిగిందని డిపో మేనేజర్ ఆర్. సీతారామ నాయుడు తెలిపారు.

హఠాత్తుగా వస్తున్న శారీరిక మార్పులపై అప్రమత్తం

విశాలాంధ్ర - పొందూరు : ఇటీవల కాలంలో తారెత్తుతున్న ఎండలు, నేటి వాతావరణ మార్పులు కారణంగా ప్రబలుతున్న వ్యాధుల పట్ల అప్రమత్తం కావాలని జీఎంఆర్ వైద్యా నిపుణులు డాక్టర్ గోర్ల రామారావు విద్యార్థులకు సూచనలు అందించారు. మండలం లోలుగు ఉపహార్ స్వచ్ఛంద సంస్థకు చెందిన150 మంది పాఠశాల పిల్లలకు ఆరోగ్య సూచనలు పట్ల ప్రత్యేక అవగాహన కల్పించే కార్యక్రమంలోపాల్గొని పై విధంగా అన్నారు.విద్యార్థిని విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత ను తూచా పాటించాలనికోరారు. వాతావరణ మార్పులు కారణంగా అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలోఏరియా మేనేజర్ బి ఎం పాల్, కోఆర్డినేటర్ ఏసుదాసు, కమ్యూనిటీ పేసిలిటేటర్ లోపేంటి అప్పారావు, సిబ్బంది మోహన్ ఉగాది స్వాతి మాలతి పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - సోంపేట : ఈ మండలం తాళ్లభద్ర, సిరిమామిడి, ఉప్పలాం సచివాలయాల పరిధిలో బుధవారం జెసిఎస్ కన్వీనర్ బుద్దాన శ్రీకృష్ణ అధ్యక్షతన అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రతి గ్రామంలోను అర్హత కలిగి ఉండి ప్రభుత్వ పథకాలకు నోచుకోని వారిని గుర్తించేందుకు జల్లెడ పట్టాలని కోరారు. అలాగే జగనన్న సురక్ష క్యాంపు ద్వారా 11 రకాల ధృవపత్రాలు జారీ చేయబడతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఓ సోమేశ్వరరావు, సర్పంచ్‌లు ఉగ్రిపల్లి కృష్ణారావు, బైపల్లి కామేశ్వరరావు, బట్టి మాధవరావు, పిన్నింటి ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పుక్కళ్ల కూర్మారావు, పిన్నింటి రేఖారావు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికుల భద్రతే ధ్యేయం

రైల్వే జిఆర్‌పి లైన్స్ ఇన్స్పెక్టర్ కె.వెంకటరావు

విశాలాంధ్ర - పలాస : రైల్వే ప్రయాణికుల భద్రత ధ్యేయమని రైల్వే లైన్స్ ఇన్స్పెక్టర్ కె. వెంకటరావు అన్నారు. బుధ వారం అవగాహన కల్పించుట. బుధవారం పలాస జీఆర్పి పోలీస్ స్టేషన్ సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందికి రైల్వే భద్రత పై అవగాహన కల్పించారు. రైలుబండ్లు లో ప్రయాణించేటప్పుడు ప్రయాణికులు ఫుట్ బోర్డు ప్రయాణం చేయడం చాలా ప్రమాదకరమని అదే విధంగా ఇతరులు ఇచ్చిన తినే పదార్థాలకు దూరంగా ఉండవలెనని అన్నారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా గంజాయి, నల్లమందు వంటి మత్తుపదార్థాలు రవాణా అరికట్టవలెనని అలాగే లోకల్ పోలీస్ తో సమన్వయము ఆర్పిఎఫ్ సిబ్బందితో సమన్వయము చేస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. ఒరిస్సా సరిహద్దు ప్రాంతమైనందున ఒరిస్సా నుండి. వచ్చు పోవు రైలుబండ్లపై ప్రత్యేక షాడో బృందం ఏర్పాటు చేసి రాత్రిపూట గస్తీ పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జీఆర్పి సిబ్బంది ఆర్పిఎఫ్ సిబ్బంది. పలాస జిఆర్‌పిఎస్ఐ షరీఫ్ పాల్గొన్నారు.

కన్న కొడుకుని చంపిన కసాయి తండ్రి

- భార్యపై అనుమానం
- కుటుంబాన్ని హతమార్చేందుకు అనుమానపు తండ్రి వ్యూహం
- దాడిలో పెద్ద కుమారుడు మృతి
- భార్యకు, చిన్న కుమారుడికి గాయాలు

విశాలాంధ్ర - ఎచ్చర్ల : నిత్యము భార్యను అనుమానించిన ఆ భర్త మొత్తం కుటుంబాన్ని హతమార్చాలని అనుకున్నాడు. భార్యతో పాటు ఆమెకు సహకరిస్తున్నారన్న నెపంతో ఇద్దరు కుమారులను, చిన్న కుమార్తెను కూడా తెగ నరకాలని వ్యూహం రూపొందించు కున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి అందరూ నిద్రిస్తుండగా ముందుగా పెద్ద కుమారుడిని హతమార్చిన అనంతరం భార్యను చంపాలనుకున్న ఆయనను అడ్డుకున్న చిన్న కుమారుడు కూడా తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే భార్య కూడా గాయపడింది. ఈ విషాదకర సంఘటన ఎచ్చెర్ల మండలం కుప్పిలి గ్రామంలో జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కుప్పయ్యకు భార్య హరమ్మ ఇద్దరు కుమారులు తాతారావు, కామరాజు ఇద్దరు కుమార్తెలలో అప్పయమ్మ (వివాహిత) లక్ష్మీ ఉన్నారు. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుప్పయ్య గత కొంతకాలంగా భార్య హరమ్మపై అనుమానం పెంచుకున్నాడు దీంతో కుటుంబ సభ్యులతో ఎప్పటికప్పుడు కుప్పయ్య తగాదాలకు దిగేవాడు భార్య భర్తల గొడవలపై గ్రామంలో పలుసార్లు పంచాయితీ కూడా జరిగాయి అయినా కుప్పయ్య వైఖరిలో ఎలాంటి మార్పు రాకపోగా భార్యతో పాటు ఆమెను సహకరిస్తున్న కుటుంబ సభ్యులపై కక్ష పెంచుకున్నాడు ఒకే ఇంట్లో వీరంతా ఉన్నప్పటికీ కుప్పయ్య మిగిలిన కుటుంబ సభ్యులు వేరువేరుగా రెండు పొయ్యిలు పెట్టుకొని వంట చేసుకుం టున్నారు కుమారులు ఇద్దరు విశాఖపట్నం విజయవాడ తదితర ప్రాంతాలకు ఉపాధి రీత్యా వెళ్లి వస్తుంటారు ఇటీవల గ్రామంలో సంబరాలు జరగడంతో ఉపాధి కోసం వెళ్ళిన కుమారులు కుమార్తెతో సహా అంతా ఒకే చోట ఉన్నారు. ఇదే అదునుగా చూసుకొని కుప్పయ్య కుటుంబ సభ్యులను చంపాలని ప్రణాళిక సిద్ధం చేశాడు. ముందుగా సిద్ధం చేసుకున్న కత్తితో అర్ధరాత్రి వేళ పెద్ద కుమారుడు తాతారావు పై ఒక్క ఉదుటున కత్తితో దాడి చేయగా బిగ్గరగా కేకలు వేయడంతో మిగిలిన కుటుంబ సభ్యులంతా నిద్ర నుంచి మేల్కొన్నారు. ఆ తర్వాత భార్య హరమ్మను చంపేందుకు ప్రయత్నించిన తండ్రిని అడ్డుకున్న చిన్న కుమారుడు కామరాజు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటనలో హరమ్మ కూడా గాయపడింది. దీంతో భయానక వాతావరణం ఏర్పడడంతో మిగిలిన కుటుంబ సభ్యులు అంతా పరుగులు తీశారు. ఇరుగుపొరుగు కుటుంబాల నుంచి జనాలు బయటకు రావడంతో కుప్పయ్య అక్కడి నుంచి పరారయ్యాడు. గాయపడిన కామరాజు హరమ్మలను శ్రీకాకుళం సర్వజనా సుపత్రి లో చేర్పించారు. ఇందులో కామరాజును మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం కెజిహెచ్ కు తరలించారు. శ్రీకాకుళం డిఎస్పి శృతి, జే ఆర్ పురం సిఐ ఆదాం సంఘటన స్థలాన్ని సందర్శించి పరిస్థితి సమీక్షించారు. ఏఎస్ఐ కృష్ణారావు కేసు నమోదు చేయగా సిఐ ఆదాం దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు చేరువలో ప్రభుత్వ పథకాలు

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందని మున్సిపల్ ఛైయిర్ పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. 90 డేస్ గృహ పథకంలో భాగంగా 9, 10 వార్డులకు చెందిన 12 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను కమీషనర్ ఎన్. రమేష్, ఆయా వార్డుల కౌన్సిలర్లు బచ్చు జగన్, వి.తేజేశ్వర రావులతో కలిసి బుధవారం పంపిణీ చేశారు. లబ్ధిదారులకు రత్తకన్న లే ఔట్ 5 వద్ద సర్వే నెంబర్ 197లో స్థలాలు కేటాయించడం జరిగిందని, ప్రజలకు చేరువలో ప్రభుత్వ పథకాలను అమలు చేయడం జరుగుతుందని, నాలుగేళ్ళ పాలనలో అర్హత బట్టి పథకాలు అందజేయడం జరుగుతుందని, ఇంకా ఎవరికైనా రాకపోయినా కొంచెం ఆలస్యమైన పథకాలు అందజేయడం జరుగుతుందని ఛైయిర్‌పర్సన్, కౌన్సిలర్లు తెలియజేసారు. తక్షణం లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణాలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

సమన్వయంతో భద్రత నియమాలు పాటించాలి

విశాలాంధ్ర - ఆముదాలవలస : గవర్నమెంట్ రైల్వే పోలీస్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ లు సమన్వయంతో వ్యవహరించి రైల్వే భద్రతా నియమాల పట్ల ప్రయాణికులకు అవగాహన కల్పించాలని విశాఖపట్నం జిఆర్‌పి లైన్స్ సర్కిల్ కె.వెంకటరావు సిబ్బందికి సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన శ్రీకాకుళం రోడ్ రైల్వే స్టేషన్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విధులు సక్రమముగా నిర్వహించాలని అన్నారు. అనుమానాస్పదంగా వ్యవహరించే వ్యక్తులను గమనిస్తూ ఉండాలని వివరించారు. రైలులో అక్రమంగా జరుగుతున్న మాదక ద్రవ్యాల రవాణాను నిరోధించాలని కోరారు. రైల్వే భద్రతపై మరింత ప్రతిష్ట బందో బస్తు అవసరమని అందుకు అనుగుణంగా కలిసి పనిచేసి ఫలితాలు సాధించాలన్నారు. ఆర్ పి ఎఫ్ మరియు జి ఆర్ పి కలిసి పని చేయాలని, ఫుట్ బోర్డ్ ప్రయాణం పై జరిగే ప్రమాదాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించాలని కోరారు, పలాస జీఆర్‌పి యస్ఐ ఎస్ కె షరీఫ్, ఆర్‌పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర ఉచిత బియ్యాన్ని రాష్ట్రానిదంటారా...!

సర్వసభ్య సమావేశంలో మండిపడ్డ టీడీపీ

విశాలాంధ్ర - పొందూరు : కేంద్ర ఉచిత బియ్యం పథకాన్ని- రాష్టనీదే అంటూ చెబుతారా? ఇదేమి న్యాయమండి? ప్రజలకు బియ్యం ఇచ్చేది కేంద్రం అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని ప్రజలను మభ్యపెట్టడం సమంజసం కాదంటూ తెలుగుదేశం మాజీ ఎంపీపీ కూన ప్రమీలతో కూడిన దేశం పార్టీ సర్పంచ్ ఎంపీటీసీలు మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షతన జరిగి సాధారణ సర్వసభ్య సమావేశంలో పాల్గొని ప్రభుత్వం అవలం బిస్తున్న తీరు పట్ల దేశం నేతలు ప్రశ్నల వర్షం కురిపించారు. వైసీపీ ప్రభుత్వంలో పంచాయితీకి ఇస్తున్న నిధులన్నీ పంచాయితీ విద్యుత్ బిల్లులకి చెల్లించవలసి వస్తుందని ముక్త కంఠంతో నిలదీశారు. సాధారణ నిధులు 14 15 ఆర్థిక సంఘం నిధులంతా ప్రభుత్వం పంచాయితీ ఖాతాల నుండి తీసుకుంటుందని, అలా అయితే పంచాయితీ అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని టిడిపి సర్పంచులు పైడి రాంప్రసాద్, బుడుమూరు పోలి నాయుడు, పప్పల వేణు తదితరులు అధికారులను నిలదీశారు. వెంటనే ఏ ఈ ప్రసాద్ కలుగజేసుకొని గతంలో పంచాయతీ బిల్లులు చెల్లింపులు జరిగాయని సర్పంచులతో వాదించారు. దీనిపై సర్పంచులు మరోసారి ప్రశ్నలు కురిపిస్తూ మండిపడ్డారు. విద్యుత్ బిల్లుల ప్రభుత్వం చెల్లించేది తప్ప ఆర్థిక సంఘం నిధుల నుండి ఎప్పుడు తీయలేదని అన్నారు. బిల్లుల సకాలంలో అందటలేదని సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా ఏఈ పాల్గుణరావు సెలవు తీసుకోకుండా కూడా విధులకు కూడా రావటం లేదని అందుకు మరో ఎఇ ని నియమించి బిల్లులు చెల్లింపులకు చర్యలు తీసుకుంటామన్నారు. మండల పరిషత్ నిధులతో పలు పనులు నిర్వహణకు తీర్మానం చేశారు. పలుశాఖల అధికారులు పాల్గొని సమాచారాన్ని అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రాంబాబు, ఎంపీడీవో హరిహరరావు, జడ్పీటిసి లోలుగు కాంతారావు, మండల నలుమూలల నుండి వచ్చిన ఎంపీటీసీలు పాల్గొన్నారు.

304 పశువులకు గొంతు, జబ్బవాపు నివారణ టీకాలు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : మండలంలోగల యరకయ్యపేట, కన్నేవలస, చుట్టుగుండం, చలమయ్యపేట, నారాయణపురం గ్రామాల పరిధిలోని 304 పశువులకు బుధవారం గొంతు, జబ్బవాపు నివారణ టీకాలు వేయటం జరిగిందని స్థానిక పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమవడంతో ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా ఈ వ్యాధి నివారణ టీకాలు మండలంలో వేయడం జరుగుతుందని, కావున రైతు లందరూ సద్వినియోగ పరచుకోవాలన్నారు. చూడి చివరి మాసాలలో ఉన్న పశువులకు మరియు మూడు మాసాలలోపు దూడలకు గాను ఈ టీకాలు కూడదన్నారు. మిగిలిన అన్ని పశువులకు వేయవచ్చునని ఆయన తెలిపారు. అలాగే ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పాడిరైతులు పశుగ్రాసం పెంచేందుకు సరైన సమయం కానుక అన్ని రైతుభరోసా కేంద్రాలలో పశుగ్రాస విత్తనాలు సబ్సిడీపై అందించటం జరుగుతుందని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బొడ్డు అప్పన్న, స్థానిక పశుసంవర్ధక సహాయకులు కె.ముకుందరావు పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ..- 13.5 తులాల బంగారం, రూ.1.6 లక్షల అపహరణ

విశాలాంధ్ర - ఎచ్చర్ల : వారి కష్టార్జితం అంతా దొంగల పాలయ్యింది. బతుకు తెరువు కోసం రెండున్నర దశాబ్దాల క్రితం ఈ ప్రాంతానికి వచ్చిన వారి రెక్కల కష్టంతో దాచుకున్నదంతా దొంగలు దోచుకున్నారు. ఈ సంఘటన ఎచ్చెర్ల మండలం పరిద్ పేట పంచాయతీ లో మంగళవారం ఉదయం జరిగింది. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం విజయనగరానికి చెందిన చోడవరపు నారాయణరావు కుటుంబ సభ్యులతో 25 ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం ఈ ప్రాంతానికి వచ్చారు. నవభారత్ సమీపంలోని పారిశ్రామిక వాడలో పనిచేస్తూ దుర్గ గుడి వద్ద జాతీయ రహదారికు అనుకుని ఉంటున్నారు. రోజూ మాదిరిగా మంగళవారం ఉదయం పారిశ్రామిక వాడలో పనిచేసేందుకు ఆయన వెళ్ళగా భార్య లక్ష్మి కూడా గ్రామంలో ఉపాధి హామీ పనికి ఉదయం 7:30 గంటలకు ఇంటికి తాళం వేసి వెళ్ళింది. దీనిని గమనించిన దొంగలు తాళాన్ని పగలగొట్టి ఇంట్లో చొరబడ్డారు. ఇంట్లోనే రెండు బీరువాలను పగలగొట్టి 13.5 తులాల బంగారు నగలు, 1.6 లక్షల రూపాయల నగదును అపహరించుకుని పోయారు. కాగా నారాయణరావు ఉదయం 9:30 గంటల సమయంలో ఇంటికి తిరిగి రాగా అప్పటికే తాళం పగలగొట్టి ఇంటి తలుపులు తెరిచి ఉండడానికి చూసి ఆందోళనగా లోనికి వెళ్ళాడు. ఇంట్లో బీరువాలు పగలగొట్టి అందులోని వస్తువులను చిందరవందరగా పడి ఉండడం చూసి పోలీసులకు సమాచారం అందించాడు. జేఆర్ పురం సిఐ ఆదామ్ క్లూస్ టీం సంఘటన స్థలాన్ని పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు.

నవధాన్యాలు సాగు ...పంటలకు ఎంతో బాగు

విశాలాంధ్ర - గార : మండలం నిజామాబాద్ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు నవధాన్య సాగు పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాట్లాడుతూ మేము గ్రామాలలో ప్రధానంగా రైతులుకి నవధాన్యాల సాగును చేసేలా క్షేత్రస్థాయిలో ప్రోత్సహిస్తున్నామని అలాగే గ్రామాలలో మా సిబ్బంది రైతులుకి అందుబాటులో ఉండి గ్రామంలో ఉన్న ప్రతి రైతుతో పూర్తి విస్తీర్ణంలో ఈ నవధాన్యాలు సాగు చేసేలా పని చేస్తున్నారని అన్నారు. అలాగే రానున్న ఖరీఫ్ సీజన్లో ప్రధానంగా ప్రతి రైతు కూడా ఎటువంటి ఎరువులు పురుగు మందులు వినియోగించకుండా కేవలం ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లోనే పంటలను పండిస్తూ అధిక దిగుబడులను పొంది ఆరోగ్యకరమైన నేలను భావితరాలకు అందించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అయినా ఎన్ఎఫ్ఏఎస్ శివాజీ, శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్ శోభన్, తేజ, రమేశ్, కల్యాణి పాల్గొన్నారు.

ప్రతి ఇంటిని సర్వే చేయాలి : ఎంపీడీఓ రమేష్ నాయుడు

విశాలాంధ్ర - పలాస : జగనన్న సురక్ష యోజన పథకంలో భాగంగా ప్రతీ ఇంటిని సర్వే చేయాలని ఎంపీ డీవో ఎన్.రమేష్ నాయుడు సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లుకు సూచించారు. బుధవారం మండలంలోని నీలావతి, మాకన్నపల్లి గ్రామాల్లో జగనన్న సురక్ష సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 30 లోగా సర్వే పూర్తి చేయాలన్నారు. ఎవరికైనా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందక పోయినా, ఇతరతర సమస్యలు ఉన్న జగనన్న సురక్ష పథకంలో నమోదు చేసుకుంటే జూలై 1 నుంచి సచివాలయాలు వద్ద ప్రారంభమయ్యే జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయాలు వద్ద అధికారుల బృందం వచ్చి అక్కడక్కడే పరిష్కారం చేయడం జరుగుతుందని చెప్పారు. ఆయనతో పాటు మాకన్నపల్లి సర్పంచ్ సైని దేసయ్య, నీలావతి సర్పంచ్ ప్రతినిధి, వైసిపి మండల ప్రధాన కార్యదర్శి సొర్ర తిరుపతిరావు, సచివాలయం ఉద్యోగులు వాలంటీర్లు పాల్గొన్నారు.